



# బడి పిల్లలకు కంటి పరీక్షలు షురూ

**సంగారెడ్డి జిల్లాలో**
**తొలిరోజు 258 మందికి పరీక్షలు**



సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో విద్యార్థినికి కంటి చూపు సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది, పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్అనీల్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు టీవీవీపీ పరిధిలోని జోగిపేట, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రుల్లో బడి పిల్లల కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ వాహనాల ద్వారా విద్యార్థులను ఆయా ఆస్పత్రులకు తరలించి పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి కళ్లద్దాల కోసం సిఫారసు చేశారు. కాగా జీజీహెచ్‌లో స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.అనీల్‌కుమార్ పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా తొలి రోజు సుమారు 258 మందికి బడి పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

### పోలీసులకూ వైద్య పరీక్షలు

సంగారెడ్డి ఎస్పీ సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జిల్లాలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, ఈసీజీ, అవసరమైన వారికి కంటిచూపు తదితర పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 250 మంది ఏఆర్ పోలీసులుండగా తొలి రోజు 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని సూపరింటెండెంట్ అనీల్‌కుమార్ తెలిపారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపిద్దాం

**సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి టౌన్ , ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్‌లో సోమవారం సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి నిర్మలా జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ అంకిత భావంతో పనిచేయాలని నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ప్రతీ పట్టభద్రుడిని కలవాలని సూచించారు. సమావేశంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వైప్రభు, టీపీసీసీ కార్యదర్శి జూలకంటి ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, హఫీజ్ షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ప్రసంగాన్ని సెల్‌ఫోన్ ద్వారా వినిపిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

# అంతా నా ఇష్టం



బదిలీ అయిన అమీన్‌పూర్ తహసీల్దార్‌పై ఆరోపణల వెల్లువ
పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట కూల్చివేతలకు తప్పుడు నివేదికలు!
కోర్టు ఉత్తర్వులను తొక్కిపెట్టి కూల్చివేతలకు గ్రీన్‌సిగ్నల్
బొమ్మన్‌కుంట ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు వత్తాసు
హైడ్రా బూచి చూపి వందలాది నిర్మాణాలకు నోటీసులు
రెవెన్యూ సిబ్బంది తెరవెనుక వసూళ్లు
బదిలీ ఉత్తర్వులను సైతం తొక్కిపెట్టిన వైనం

అమీన్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకోడ్ సమయంలో అధికారుల బదిలీలు జరగడం అసాధారణం. కానీ అమీన్‌పూర్ తహసీల్దార్ ఎం.రాధపై వచ్చిన ఆరోపణలకు ఏకంగా సీసీఎల్‌ఏ కమిషనర్ రంగంలోకి దిగి ఆగమేఘాల మీద ప్రత్యేక అనుమతితో బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అమీన్‌పూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆమె వ్యవహారశైలి వివాదాస్పదమే. హైడ్రా'ను ఆసరాగా తీసుకుని అమీన్‌పూర్‌లో పెద్దఎత్తున ప్రభుత్వ భూముల కబ్జాలు జరిగాయని తప్పుడు నివేదికలు సమర్పించి ఉన్నతాధికారులను తప్పుదారి పట్టించినట్లు తేలింది. అమీన్‌పూర్‌లో పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని నోటీసులు ఇవ్వడంతో కలకలం రేగింది. పటేల్‌గూడలో ఓకేరోజు 28 విల్లాలు, కిష్టారెడ్డిపేటలో రెండు భారీ బహుళ అంతస్తుల భవనాల కూల్చివేతల్లో తహసీల్దార్ వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. న్యాయస్థానం స్టేటస్-కో ఆర్డర్ జారీచేసినా కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు తెలియజేయకుండా ఆదివారం రోజు కూల్చివేతలకు పాల్పడటానికి తహసీల్దారే కారణమని తెలిసింది. ఈ కూల్చివేతలను హైకోర్టు తప్పుబట్టడంతో హైడ్రా కమిషనర్ వివరణ ఇచ్చుకోవాల్సి రావడం రెవెన్యూ వర్గాల్లో సంచలనంగా మారింది.

### పటేల్‌గూడపై తప్పుడు నివేదికలు

పటేల్‌గూడ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 12లోని ప్రభుత్వ భూమి పక్కనే ఉన్న సర్వే నంబర్ 6లోని పట్టా భూమిలో నిర్మించిన ఇళ్లను కూల్చివేయడం తీవ్ర సంచలనంగా మారింది. కోర్టు ఆర్డర్ ఉన్నా తహసీల్దార్ మొదటి నుంచి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించారన్న విమర్శలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో 28 ఇళ్లను కూల్చివేసినా.. హైడ్రాకు ఇచ్చిన నివేదికలో 17 ఇళ్లను కూల్చామని తప్పుడు నివేదిక ఇవ్వడం గమనార్హం. కిష్టారెడ్డిపేట సర్వే నంబర్ 194లో భవనాల కూల్చివేతల విషయంలోనూ అధికారుల తీరును హైకోర్టు తప్పు పట్టింది. ఇందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

### హైడ్రా బూచి చూపి ఎడాపెడా నోటీసులు

హైడ్రా కూల్చివేతల తరువాత అమీన్‌పూర్ మండల పరిధిలో రియల్‌ఎస్టేట్ వర్గాలు వణికిపోయాయి. ఇదే అదనుగా తహసీల్దార్ వందల సంఖ్యలో నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ భూములు విస్తరించి ఉన్న 993 996, 1,056, 1,000, 630 తదితర సర్వే నంబర్లకు ఆనుకుని ఉన్న పట్టా భూముల్లోని భవనాలకు, బీరంగూడగుట్ట చుట్టూ పట్టా భూముల్లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లకు సైతం నోటీసులు జారీ చేశారు. 10 రోజుల వ్యవధిలో 800 నోటీసులు జారీ చేయడం గమనార్హం. 993 సర్వే నంబర్‌ను ఆనుకుని ఉన్న మల్లికార్జున్‌నగర్ కాలనీ చివరి ప్లాట్లలోని నిర్మాణాలకు గూగుల్‌ఎర్త్ మ్యాప్‌ను ఫోన్‌లో చూస్తూ సర్వేయర్ ద్వారా అక్కడికక్కడ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. ఈ కాలనీకి సంబంధించి రాష్ట్రస్థాయి జాయింట్ డైరెక్టర్ ఇచ్చిన సర్వే నివేదిక ఉందని తెలియకుండా నోటీసులు ఇచ్చారని బాధితులు నిలదీయడంతో తప్పు జరిగిందని తప్పించుకున్నారు. ఆయా నోటీసుల్లోని నిర్మాణాలను నిషేధిత జాబితాలో చేర్చడంతో బిల్డర్లు లబోదిబోమంటున్నారు. వాల నారాయణరావు భూములను ఆనుకుని ఉన్న పట్టా భూములకు, చక్రపురి కాలనీలో వివాదాస్పద భూములకు నోటీసులు జారీచేసి రెవెన్యూ సిబ్బంది తెరచాటున సొమ్ము చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా జీవో 58, 59 కింద క్రమబద్ధీకరణ చేసిన వాటికి సైతం నోటీసులు జారీ చేశారు.

### సుల్తాన్‌పూర్ సర్వే నంబర్ 30లో కబ్జాలకు వంతపాట

మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని బొమ్మన్‌కుంట సర్వే నంబర్ 30లో కోట్లాది రూపాయల విలువైన భూముల కబ్జాలకు తెరవెనక తహసీల్దార్ రాధ వత్తాసు పలికారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూముల్లో లేఅవుట్ వేసి నోటరీల ద్వారా పెద్ద ఎత్తున భూముల అమ్మకాలు జరిగినా, ఏకంగా ప్రార్థనా స్థలం నిర్మించినా తహసీల్దార్ చూసీ చూడనట్లు వదిలేశారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో కలెక్టర్‌కు ఫిర్యాదులు

మిగతా 8వ పేజీలో..

# విద్యుత్ శాఖకు బకాయిల షాక్

మెదక్ జిల్లాలో రూ. 79.66 కోట్ల బిల్లులు పెండింగ్
ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిందే అధికం
మొండి బకాయిలకు నోటీసులతోనే సరి



మెదక్ అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా విద్యుత్ శాఖకు బకాయిలు కలవరపెడుతున్నాయి. ప్రభుత్వ శాఖలకు చెందిన బిల్లులు పేరుకపోవడయంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో రూ.79.66 కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉండగా.. ఇందులో రూ.45.99 కోట్లు ప్రభుత్వ శాఖలకు సంబంధించినవి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో అన్ని కేటగిరిల విద్యుత్ కనెక్షన్లు 3,55,093 ఉన్నాయి. ఇందులో కేటగిరి-1కు సంబంధించి 2,09,174 ఉన్నాయి. కమర్షియల్ వ్యవసాయం 1,00,038 కనెక్షన్లు, పరిశ్రమలు 24,011 ఉన్నాయి. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రూ.39.35 కోట్లు, మున్సిపల్స్ అర్బన్ డెవలప్‌మెంట్ రూ.3.96 కోట్లు, వైద్య ఆరోగ్యశాఖ రూ1.30 కోట్లు, పోలీస్ శాఖ రూ.82 లక్షలు, విద్యాశాఖ రూ.24 లక్షలు, రెవెన్యూ శాఖ రూ.11 లక్షలు, అటవీ శాఖ రూ.10 లక్షలు బకాయి ఉన్నాయి. కేటగిరి-1లో వ్యవసాయ రూ.12.35 కోట్లు, కమర్షియల్ రూ.6.78 కోట్లు, పరిశ్రమలు రూ.39 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

### వసూలయ్యే దారేది.?

విద్యుత్ బిల్లుల బకాయిల చెల్లింపులపై ఆయా శాఖలు ఆసక్తి చూపడం లేదు. ఆర్థిక సంవత్సరం చివరి దశకు చేరుతున్న నేపథ్యంలో బకాయిల వసూళ్లపై విద్యుత్ శాఖ దృష్టి సారిస్తోంది. విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ)కి డిస్కం సమర్పించిన నివేదికలో బకాయిల వివరాలను పొందుపరిచింది. అత్యధికంగా ప్రభుత్వ శాఖలే నుంచి బకాయిలు ఉన్నందున అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. పెండింగ్ బిల్లులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయినా ఆశించినా మేరకు వసూళ్లు జరగడం లేదు. బిల్లులు చెల్లించకపోతే ఏం అవుతుందిలే అన్న నిర్లక్ష్యపు ధోరణి ప్రభుత్వ అధికారుల్లో నెలకొంది ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యుత్‌శాఖ నామమాత్రపు చర్యలతో మమ అనిపిస్తోంది. నోటీసులతోనే సరిపెడుతుండడంతో వసూళ్ల కష్టంగా మారింది.

## గర్భిణులు, బాలింతలకు అందించే భోజన నాణ్యతలో రాజీ లేదు

**మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**



ఆహార నాణ్యత పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు అందించే భోజనం నాణ్యతలో రాజీ పడేది లేదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పిల్లికొట్యాల్‌లో ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లను నాణ్యమైన భోజనం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. రోగులు నాణ్యమైన ఆహార పదార్థాలు అందిస్తున్నారని తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వైద్యశాఖ ఉన్నతాధికారులతో కలసి అక్కడే భోజనం చేశారు. కార్యక్రమంలో సూపరిండెంట్ శివ దయాల్, ఆర్ఎంవో షర్మిల, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, హెచ్‌వోడీలో సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

### సంత్ సేవాలాల్ మార్గం అనుసరణీయం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతీఒక్కరు నడవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ 286వ జయంతి వేడుకలను పట్టణంలోని సేవాలాల్ మందిరంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై సేవాలాల్ చిత్రటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ శ్రేయసు కోసం సంత్ సేవాలాల్ బోధనలను అందరూ ఆచరించాలని సూచించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా అధికారి నీలిమ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి శశికళ, బంజారా సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇది నేనేనా?



అద్దంలో ఉన్నది నేనేనా.. అని బైక్ అద్దంలో చూసుకుంటున్నది ఓ పిచ్చుక. తన ఇలాకాలోకి కొత్త పిచ్చుక వచ్చిందని అద్దాని పొడిచి తరుముతున్న దృశ్యం పల్వంచలో కనిపించింది. -టేక్మాల్

## వాహ్.. క్యా ఐడియా

జొన్న కంకులను పక్షుల నుంచి కాపాడుకునేందుకు కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు వినూత్న ఆలోచన చేశాడు. ప్లాస్టిక్ కవర్లు, పాలిథిన్ సంచులను కంకులకు కట్టాడు. దీంతో, పక్షులు కంకులపై వాలినా జొన్నలు తినలేకపోతున్నాయి.
-కొండాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి)



# టమాట ధర.. ఢమాల్

కిలో రూ. 5 మాత్రమే!
నష్టాల పాలవుతున్న రైతులు
పెట్టుబడి తిరిగిరాని వైనం





మెదక్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): టమాట ధరలు మరోసారి పతనమవుతున్నాయి. మెదక్ జిల్లాలోని ప్రధాన మార్కెట్లలో రైతులు కిలో టమాట నాణ్యతనుబట్టి రూ.8 నుంచి రూ.5 వరకు విక్రయిస్తున్నారు. చేగుంట, రామాయంపేట, నిజాంపేట, తూప్రాన్, కొల్చారం, పాపన్నపేట, అల్లాదుర్గం, కౌడిపల్లి, శివంపేట, నర్సాపూర్, వెల్దుర్తి తదితర మండలాల్లో 450 ఎకరాల్లో టమాట పంట వేశారు. గత సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు టమాట ధర రూ.80 వరకు చేరింది. నవంబరు, డిసెంబరు నెలల్లో సాగుచేసిన పంట ప్రస్తుతం దిగుబడి వస్తోంది. చిత్తూర్ జిల్లా మదనపల్లి, కర్నూలు, అనంతపురం నుంచి కూడా దిగుమతి చేసుకుంటారు. దీంతో, ధరలు ఒక్కసారిగా పడిపోయియి. పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేక రైతులు నష్టాల పాలవుతున్నారు.

### ప్రాసెసింగ్ యూనిట్లు కరువు

ఫిబ్రవరి, మార్చి మాసాల్లో సాధారణంగా టమాటా ధరలు తక్కువగా ఉంటాయి. పంట అమ్ముడు పోకపోవడంతో వృథా అవుతుంది. ఈ కాలంలో టమాటతో ఇతర ఉత్పత్తులు తయారు చేసేలా ప్రాసెసెంగ్ యూనిట్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ చేస్తే రైతులకు మేలు చేకూరుతుంది. టామాటతో జ్యూస్, సాస్, చట్నీ, ప్యూరీ, పేస్ట్, పౌడర్.. ఇలా పలు రకాలుగా ప్రాసెసింగ్ చేసి ఎగుమతి చేయడం ద్వారా ఆదాయం పొందవచ్చు. ఈ యూనిట్లతో స్వయం సహాయక సంఘాలు, మహిళలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చు.

### పెట్టుబడి కూడా తిరిగి రాలేదు



టమాట పంట పండించడానికి డ్రిప్, మాల్చింగ్, ఎరువులు, పురుగుమందుల కోసం ఎకరాకు రూ.50వేల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. పంటలను మార్కెట్‌కు తరలించడానికి రవాణా ఖర్చులు అదనం. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో పెట్టుబడి కూడా కావడం లేదు.

-మధుసూదన్‌రెడ్డి, రైతు

### అమ్మకాలు తగ్గిపోయాయి



మెదక్ మార్కెట్‌కు చుట్టుపక్కల మండలాల నుంచే కాకుండా కామారెడ్డి జిల్లా సరిహద్దు గ్రామాల నుంచి రైతులు టామాటను తెస్తున్నారు. వారం రోజులుగా హోల్‌సేల్‌గా కిలో రూ.5కే విక్రయిస్తున్నాం. రైతులకు గిట్టుబాటు కాకపోవడంతో చేలలోనే పంటను వదిలేస్తున్నారు.

-బొద్దుల కృష్ణ, వ్యాపారి, మెదక్

### ఏటా ఇదే సమయంలో..



ప్రతీ సంవత్సరం యాసంగి టమాటకు ఆశించిన ధరలు రావడం లేదు. జిల్లాలో సుమారు 450 ఎకరాల్లో టమాటా పంట వేశారు. జిల్లాలో ప్రాసెసింగ్ యూనిట్లు లేవు. పంటను నిల్వచేసుకునే అవకాశం లేదు. ధర పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

-ప్రతాప్‌సింగ్, ఉద్యానవన అధికారి, మెదక్ జిల్లా

## రాళ్లను తొలచి.. రోళ్లుగా మలచి

కండలు కరిగితేనే కడుపు నిండేది
రోళ్లు, ఇసుర్రాళ్లకు డిమాండ్ లేక దినదినగండంగా బతుకు
గుడిసెల్లోనే మగ్గుతున్న చెర్లగూడెం కాశవాడ ప్రజలు
ఉపాధి కోసం చెత్త ఏరుకుంటున్న ఇప్పటి తరం

7



## మల్లన్న ఆలయ సమీపంలో
# నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

చేర్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోని పలు కిరాణా దుకాణాలు, పాన్ షాప్‌లు, హోటళ్లతో పాటు పలు అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు సోమవారం నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలను సేవించినా, విక్రయించినా, రవాణా చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. యువత తాత్కాలిక ఆనందంకోసం గంజాయి, డ్రగ్స్‌వంటి వాటికి అలవాటుపడకూదని, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని తెలిపారు. గంజాయి, ఇతరత్రా మత్తుపదార్థాలు కలిగిన విషయాన్ని 100నంబర్‌కు లేదా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1098కు కాల్‌చేసి సమాచారం అందించాలని సూచించారు.

## భగలాముఖి ఆలయం..
# భక్తిపారవశ్యం

- ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు


పూజలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి


భగలాముఖి అమ్మవారు

శివ్వంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేటలో కొలువైన భగలాముఖి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలను నిర్వహించారు. 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి గ్రామంలోని పురవీధుల్లో అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున మంగళహారతులు సమర్పించారు.ట్రస్టు సభ్యుడు మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, స్థలదాత స్వరూప రమేష్‌గుప్తా, మాజీ ఎంపీపీ హరికృష్ణ, నాయకులు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## తెల్లాపూర్‌లో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠోత్సవం


ఆలయంలో ఆదర్శరెడ్డి తదితరులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్‌లో బీరప్ప స్వామి కామరాతి అమ్మవార్ల, భ్రమరాంభిక మల్లికార్జున స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. సోమవారం ఈ మహోత్సంలో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు వి.ఆదర్శరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెలిమెలలో జరిగిన బీరప్ప ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శరెడ్డి మాట్లాడుతూ ఆలయాల నిర్మాణం, ఉత్సవాల కార్యక్రమాల్లో తన వంతు సహకారం ఉటుందన్నారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి, సుచరితకొమురయ్య, పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, ధరణి రాజు, నర్సింహరెడ్డి, నవారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై మల్లన్న స్వామి దీవెనలు ఉండాలి

- మెదక్ పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధుముదిరాజ్


మల్లికార్జునస్వామి జాతరలో నీలం మధు, ఆవుల రాజిరెడ్డి తదితరులు

హత్నూర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంటరీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం పన్యాల గ్రామంలో నిర్వహించిన మల్లన్న జాతర మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, హత్నూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రే కృష్ణ, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, జాతర నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'లోక్‌అదాలత్‌పై విస్తృత ప్రచారం చేయండి'

జహీరాబాద్, ఫిబ్రవరి 17 : కక్షిదారుల ప్రయోజనాల దృష్ట్యా కోర్టుల ఆధ్వర్యంలో నిర్వహించే లోక్‌అదాలత్‌ల గురించి విస్తృత ప్రచారం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ సూరీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్‌లోని కోర్టు ఆవరణలో పోలీసులతో, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మార్చి 8న జాతీయలోక్‌అదాలత్‌ను నిర్వహించనున్న నేపథ్యంలో కక్షిదారులకు రాజీ గురించి వివరించాలన్నారు. సమావేశంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు మాణెన్న, న్యాయవాదులు, పోలీసులు, లీగల్‌సర్వీసెస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

జహీరాబాద్, ఫిబ్రవరి 17 : మొగుడంపల్లి మండలంలోని పర్వతాపూర్ గ్రామశివారులో గల ప్రభుత్వ భూములను సోమవారం ట్రైనీ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. పర్వతాపూర్‌కు చెందిన పలువురు లబ్ధిదారులు 14 సర్వేనంబర్‌లో తమకు కేటాయించిన 20 ఎకరాల భూములను సర్వే చేసి ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, ఆయన స్పందించి క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. త్వరలో సర్వే చేసి భూములను లబ్ధిదారులకు కేటాయించాలని అధికారును ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో రాంరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు చింతమడక విద్యార్థినులు

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి); ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 18, 19న జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు సిద్దిపేట రూరల్ మండలం చింతమక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి కొత్త రాజిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ తొమ్మిదోవ తరగతి చదువుతున్న విద్యార్థినిలు రాయం శ్రీలాస్య, పిట్ల వైష్ణవి సిద్దిపేటలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఎంఈవోతోపాటు పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

### హవేళిఘణపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపిక

హవేళిఘణపూర్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి) : హవేళిఘణపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నవీన్ (400 మీటర్లు), ప్రకాష్‌సింగ్ (1000 మీటర్లు), రోహిత్ గౌడ్ (100 మీటర్స్ షాట్‌పుట్) రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

# బైకును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

## ఇద్దరు యువకుల దుర్మరణం


శంకర్, పవన్ (ఫైల్)

కోహీర్, ఫిబ్రవరి 17: (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృత్యువాత పడిన ఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సిద్దాపూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. కోహీర్ ఎస్ఐ గోపతి సతీష్ కథనం ప్రకారం.. జహీరాబాద్ మండలం అర్జున్‌నాయక్ తండాకు చెందిన శంకర్ రాథోడ్ (28), పవన్ జటోత్ (29) ఆదివారం మధ్యాహ్నం కోహీర్ మండలంలోని షెడిగుట్ట తండాలో తమ బంధువుల ఇంటివద్ద జరిగిన విందుకు హాజరయ్యారు. అక్కడ రాత్రి 8 గంటల వరకు ఉండి అక్కడి నుంచి కోహీర్ మండలంలోని సిద్దాపూర్ గ్రామంలోని తమ బంధువుల ఇంటికి బయలు దేరారు. సిద్దాపూర్ శివారులో ఓ మూలమలుపు వద్ద తాండూరు నుంచి జహీరాబాద్ వైపు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రాథోడ్ శంకర్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన పవన్ జటోత్‌ను చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పవన్ జటోత్ చికిత్స రాత్రి 12:30 గంటలకు సమయంలో మృతి చెందాడు. రాథోడ్ శంకర్ భార్య మంజుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

## లోతువాగు వద్ద యువకుడు..

కొల్చారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్ర శివారులో లోతువాగు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం కౌడిపల్లి మండలం కన్నారం గ్రామానికి చెందిన బసవన్నగారి రాజేందర్ (26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం సొంత పనిమీద తన ద్విచక్ర వాహనంపై మెదక్ వెళ్లి తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా లోతువాగు వద్దకు రాగానే ఎదురుగా ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మేనమామ ఆకుపడాల సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భార్యను కొట్టి చంపిన భర్త

## మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఘాతుకం

మనోహరాబాద్ ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు అడిగితే ఇవ్వలేదని భార్యను కర్రతో కొట్టి చంపిన ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పరిధి పోతరాజ్‌పల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆదివాస్ అశోక్, అతని భార్య శివకాశిలు పోతరాజ్‌పల్లిలో అద్దెకు ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అశోక్ పని చేయకుండా మద్యం తాగుతూ తిరుగుతుండేవాడు. ఆదివారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్య శివకాశి(35)తో గొడవ పడ్డాడు. ఆమె ఇవ్వకపోవడంతో పక్కనే ఉన్న కర్రతో తలపై, కాళ్లపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం ఇంటి యాజమాని సాద ప్రవీణ్ వచ్చి చూడగా, శివకాశి చనిపోయి ఉంది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారించగా, భర్త అశోక్ నేరం అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కారు బోల్తా పడి వ్యక్తి మృతి

సిద్దిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అల్వాల గ్రామంలో సోమవారం జరిగింది. మిరుదొడ్డి ఎస్సై పర్శరాములు కథనం ప్రకారం.. అల్వాల గ్రామానికి చెందిన బొమ్మజ్యోతి-చందర్‌ల గృహప్రవేశానికి రంగారెడ్డి జిల్లా మల్లాపూర్ గ్రామానికి చెందిన బంధువులు వచ్చారు. ఇందులో యశ్వంత్, నాగ జశ్వంత్, జయరక్షిత్‌లు గ్రామంలో వ్యవసాయ భూముల వద్దకు కారులో వెళ్తుంగా, మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న జయరక్షిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారికి గాయాలు కాగా, వారిని 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జీపు బోల్తా.. ఐదుగురికి గాయాలు


జాతీయ రహదారిపై బోల్తా పడిన వాహనం

అల్లాదుర్గం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాయిదంపల్లి సమీపంలో 161వ జాతీయ రహదారిపై తూపాన్ వాహనం బోల్తాపడిన ఘటనలో ఐదుగురికి గాయాలు అయ్యాయి. నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్ ప్రయాణికులతో వెళ్తున్న తుఫాను వాహనం ప్రమాదవశాత్తు కాయిదంపల్లి వద్ద బోల్తా పడగా, ఈ ప్రమాదంలో నారాయణఖేడ్ మండలం అతిమ్యాల్ గ్రామానికి చెందిన నర్సింహులుకు చేయి తెగిపోయింది. ఇతడిని హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు అల్లాదుర్గం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# జాతీయ రహదారిపై ఖాళీ బాటిళ్ల లారీ


హైవేపై పడిపోయిన ఖాళీ సీసాల లారీ

రామాయంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రామయంపేట ఎన్‌హెచ్ 44 పై ఆదివారం రాత్రి ఖాళీ సీసాల లోడ్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనతో రహదారిపై చెల్లాచెదురుగా సీసా ముక్కలు పడిపోగా వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎన్‌హెచ్ అథారిటీ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని సీస ముక్కలు ఏరివేయించారు. తద్వారా రోడ్డు క్లియర్ కాగా.. పడిపోయిన లారీలోని మిగతా ఖాళీ బాటిళ్లను మరో వాహనంలోకి లోడ్ చేయించారు.

# ఆగి ఉన్న కారును ఢీకొన్న స్కూల్ బస్సు



బెజ్జంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారును స్కూల్ బస్సు ఢీ కొట్టిన ఘటన మండలంలోని గాగిళ్లపూర్ రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రేగులపల్లి గ్రామంలోని సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూల్‌కు చెందిన బస్సు సోమవారం సాయంత్రం పిల్లలను ఇంటి వద్ద దింపేందుకు తోటపల్లి వైపు వస్తోంది. ఈ క్రమంలో గాగిల్లాపూర్ శివారులోని రాజీవ్ రహదారి పక్కకు ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో సుమారు 10 మంది పిల్లలు ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

తూప్రాన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్కాపూర్‌లో అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... మల్కాపూర్ గ్రామానికి చెందిన మామిండ్ల కనకరాజు (30)వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధతో తీవ్ర మనస్థాపానికి గురై ఈనెల 9న తన వ్యవసాయ భూమి వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ సోమవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రాళ్లను తొలచి.. రోళ్లుగా మలచి



## కండలు కరిగితేనే కడుపు నిండేది


ఇసుర్రాళ్లు, రోళ్లు తయారు చేయడానికి సిద్ధంగా ఉన్న బండరాళ్లు

> రాళ్లను తొలచి రోళ్లుగా మలిచే నైపుణ్యం వారిది.. అయినా రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు వారివి. కాలం మరడంతో తమ పనికి డిమాండ్ తగ్గినా తరతరాలుగా వస్తున్న వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారు. చేసే పనిని వదులుకోలేక.. వేరే పని చేయడం తెలియక దుర్భరమైన జీవితం గడుపుతున్నారు కంది మండలం చెర్లగూడెం పరిధిలోని కాశవాడ వాసులు.

- రోళ్లు, ఇసుర్రాళ్లకు డిమాండ్ లేక దినదినగండంగా బతుకు
- గుడిసెల్లోనే మగ్గుతున్న చెర్లగూడెం కాశవాడ ప్రజలు
- ఉపాధి కోసం చెత్త ఏరుకుంటున్న ఇప్పటి తరం

కంది, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న కంది మండలంలోని చెర్లగూడెం పరిధిలో ఉన్న కాశవాడ ప్రజలు తరతరాలుగా రాళ్లతో రోళ్లు, ఇసుర్రాళ్లు తయారు చేసి విక్రయించడమే వృత్తిగా జీవిస్తున్నారు. 70 ఏళ్ల క్రితం కర్ణాటక నుంచి వలస వచ్చిన కొన్ని కుటుంబాలు కాశ కులస్తులుగా పేరుపొంది చెర్లగూడెం శివారులో స్థిరపడ్డారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం బీసీ(బీ)గా గుర్తించారు. రోళ్లను తయారు చేయడం కోసం వికారాబాద్ జిల్లా తాండూరు సమీపంలోని జినుగుర్తి అటవీ ప్రాంతం నుంచి ముడి రాళ్లను తెచ్చుకుంటారు. ఇక్కడి వరకు లారీ లోడు రాళ్లను తీసుకురావడానికి కిరాయి రూ.30 వేలు అవుతోంది. రోజంతా కూర్చుని ఒక రోలును తయారుచేస్తే రూ. 400 మాత్రమే గిట్టుబాటు అవుతుంది. ఇసుర్రాయి తయారుచేస్తే రూ. 800 వస్తాయి. మగవారు రోళ్లు, ఇసుర్రాళ్లను తయారుచేస్తే.. మహిళలు గ్రామాల్లో వీధివీధి తిరిగి వాటిని విక్రయిస్తుంటారు.


గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్న కాశవాడ ప్రజలు

ప్రస్తుతం కాశవాడలో 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. దశాబ్దాలుగా వీరంతా గుడిసెల్లోనే దుర్భర జీవితం గడుపుతున్నారు. వృత్తి పని గిట్టుబాటు కాకపోవడంతో సరైన ఉపాధి లేక అల్లాడుతున్నారు. వీరిలో కొందరు యువకులు హైదరాబాద్‌కు వెళ్లి భవన నిర్మాణ కార్మికులుగా జీవిస్తుండగా.. మరికొందరు యువకులు, చదువుకునే వయసున్న పిల్లలు బతుకుదెరువు కోసం చెత్త సేకరణ చేస్తున్నారు. కంది మండలంతో పాటు, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర పట్టణాల్లో తిరుగుతూ చెత్తను సేకరిస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. తల్లిదండ్రుల వలె రాళ్లు కొట్టే ఓపిక లేదని, ఆ పని చేస్తే కడుపు నింపడం లేదని, అందుకే చెత్త సేకరించి బతుకీడిస్తున్నామని కాశవాడ యువకులు చెబుతున్నారు. తమ పరిస్థితే ఇలా ఉంటే పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందోని బావురుమంటున్నారు. ప్రభుత్వం ఆదుకొని ఉపాధి కల్పించాలని, బీడీ కార్మికులు, చేనేత కార్మికుల వలె పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

### ఉపాధి లేక చెత్త సేకరణ



### రోజంతా కష్టపడితేనే బతకగలం

ఒకరాయిని రోలుగా తయారు చేయాలంటే రోజంతా కష్టపడాల్సి వస్తుంది. రాళ్లను రోళ్లుగా, ఇసుర్రాళ్లుగా మలిచే క్రమంలో రాళ్ల పెంకులు ఎగిరివచ్చి దెబ్బలు తగులుతాయి. అన్నీ భరిస్తేనే పూట గడుస్తుంది. రోజురోజుకూ ఒంట్లో ఓపిక నశిస్తోంది. పిల్లల భవిష్యత్తు తలుచుకుంటేనే భయంగా ఉంటుంది. ఎంతోమంది అధికారులు మా జీవన విధానాన్ని తెలుసుకున్నారే తప్ప మా బతుకుల్ని బాగు చేయడానికి ముందుకు రాలేదు.

-పందెండి పాపయ్య, కాశవాడ, చెర్లగూడెం


అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న చెర్లగూడెంలోని కాశవాడ

### తరాలు మారినా తలరాత మారలే



ముత్తాతల కాలం నుంచి మేము రోళ్లు కొట్టుకునే బతుకుతున్నాం. మా కండలు కరిగితేనే మా పిల్లల కడుపు నిండుతుంది. బండరాళ్లే మా జీవితంలో తోడు నిలిచాయి. రోజురోజుకు ఒంట్లో సత్తువ తగ్గిపోతుంది. రానురానూ గంజి కూడా దొరకడం కష్టంగా మారుతున్నది. రోగాలు వస్తే వైద్యం చేయించుకునే స్తోమత కూడా లేదు. ఇప్పటికీ గుడిసెల్లోనే మా బతుకులు వెల్లదీస్తున్నాం. ప్రభుత్వం మమ్మల్ని ప్రత్యేక కార్మికులుగా గుర్తించి పింఛన్ అందించాలి.

-ఆరకుంట జములయ్య, కాశవాడ, చెర్లగూడెం

### గిట్టుబాటు కావడం లేదు



తాండూరు నుంచి రాళ్లు తెచ్చి రోళ్లుగా తయారు చేసి గ్రామాల్లో వీధి వీధి తిరిగి విక్రయిస్తుంటాం. ఇంత కష్టపడినా రోజు కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ఈ పని కడుపు నింపకపోవడంతో పిల్లలను చెత్త ఏరుకునేందుకు పంపుతున్నాం. పొలాలు, జాగాలు లేవు. వ్యవసాయ పనులు చేయడం మాకు రాదు. రెక్కల కష్టాన్ని నమ్ముకుని బతుకుతున్నాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

-గుంతపల్లి దుర్గయ్య, కాశవాడ, చెర్లగూడెం

# ఆర్చరీ ఛాంపియన్ రశ్మిత

**జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలో బంగారు పతకం**

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన చిరుకోటి రశ్మిత రెడ్డి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఆర్చరీ-2025 పోటీల్లో ఛాంపియన్ షిప్ సాధించి, బంగారు పతకాన్ని గెలుచుకుంది. సంగారెడ్డి జిల్లా కొల్లూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మైదానంలో ఈ పోటీలు జరిగాయి. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఛాంపియన్ షిప్ పోటీలలో వివిధ జిల్లాల నుంచి ఆర్చరీ క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన 31 మంది క్రీడాకారులతో పోటీ పడిన రశ్మితరెడ్డి ఆర్చరీలో ప్రథమ స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో రశ్మితారెడ్డి 9వ తరగతి చదువుతోంది. రంగారెడ్డి జిల్లా తరుపున రశ్మిత రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఆర్చరీలో ప్రతిభ కనబర్చిన రశ్మితను తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కోచ్ రవిశంకర్, సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

**సీఎం కప్ పోటీల్లోనూ..**

రాష్ట్రస్థాయి సీఎం కప్- 2024 పోటీలలో స్టేట్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రశ్మితరెడ్డి సిద్దిపేట జిల్లా తరపున పాల్గొని రెండో స్థానంలో నిలిచింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 31 నుంచి 2025 జనవరి 1వ తేదీ వరకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సీఎం కప్ 2024 కోసం స్టేట్ ఆర్చరీ ఛాంపియన్షిప్ పోటీలను నిర్వహించారు.


రశ్మితను అభినందిస్తున్న సీపీ అనురాధ

**తల్లిదండ్రుల ప్రోత్సాహం..**

జిల్లాలోని నారాయణరావుపేట్ మండలం జక్కాపూర్‌కు చెందిన చిరుకోటి నరేందర్ రెడ్డి, లాస్య దంపతుల కుమార్తె రశ్మిత రెడ్డి రంగారెడ్డి జిల్లాలోని క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. నరేందర్ రెడ్డి ప్రస్తుతం హోంగార్డ్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. కుమార్తె రశ్మితరెడ్డికి క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. దీంతో నాలుగో తరగతి చదువుతున్నప్పుడు తెలంగాణ క్రీడా పాఠశాలకు ఎంపికైంది.

# దూరం పెట్టిందన్న కోపంతో మహిళ హత్య

## నిందితుడి అరెస్ట్.. రిమాండ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని.. తనను దూరం పెట్టడంతో ఆ మహిళపై కోపంతో హత్య చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ (45) ఇద్దరు కుమారులతో కలిసి ఉంటూ, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయాగా పని చేస్తోంది. చిన్నశంకరంపేట మండల పరిధిలోని ఎస్ కొండాపూర్‌కు చెందిన యేసు బతుకుదెరువు కోసం రెండేళ్ల కింద భార్యతో కలిసి వచ్చి సదరు మహిళ ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్నాడు. వారి మధ్య పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఆమె ఇంట్లో గొడవలు జరుగుతుండటంతో యేసును దూరం పెట్టింది. దీనిని మనసులో పెట్టుకున్న యేసు ఈ నెల 6న ఆమెకు ఫోన్ చేసి.. ఎస్. కొండాపూర్ శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలిసి మద్యం తాగారు. మత్తులో కింద పడిపోయిన ఆమెపై పెట్రోల్ పోసి తగులబెట్టడు. తల్లి కనిపించకపోవడంతో ఆమె కుమారుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 8న మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఫోన్ కాల్ లిస్ట్ పరిశీలించగా, యేసుపై అనుమానం వచ్చింది. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, విషయం బయటపడింది. దీంతో నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

# బైక్‌పై నుంచి పడి గర్భిణి మృతి

చేగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారి పడి ఓ గర్భిణి మృతి చెందిన ఘటన నర్సింగ్ మండలం సంకాపూర్ శివారులో సోమవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి రవళి (28) సోమవారం మెదక్ ఆసుపత్రిలో నెలసరి చికిత్సకు వెళ్లింది. అక్కడి నుంచి తన తల్లిగారి ఇల్లు అయిన మెదక్ మండలం రాయిన్‌పల్లికి వెళ్లి, తిరిగి భర్త ముప్పిడి నవీన్‌తో కలిసి ద్విచక్రవాహనం పై రెడ్డిపల్లికి వస్తుండగా నార్సింగ్ మండలం సంగాపూర్ గ్రామ శివారులో బైక్ పై నుండి కింది పడింది. తీవ్ర గాయాలైన ఆమెను 108 అంబులెన్స్‌లో నార్సింగి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు మూడు సంవత్సరాల పాప ఉంది.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం


కిష్టారెడ్డిపేటలో అక్రమ అంతస్తులను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అమీన్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సోమవారం ఉక్కుపాదం మోపారు. 'అనుమతితో కొన్ని అక్రమంగా మరిన్ని'.. అనే శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారి పవన్ నేతృత్వంలో సిబ్బంది కూల్చివేతల డ్రైవ్ నిర్వహించారు. అక్రమ అంతస్తులను గుర్తించి కట్టర్లతో స్లాబ్‌లను తొలగించారు. ఈ సందర్భంగా టీపీఓ పవన్ మాట్లాడుతూ ఇటీవల మున్సిపాలిటీలో విలీనమైన పంచాయతీల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలోనే నోటీసులు సైతం జారీ చేశామన్నారు. పంచాయతీలలో జీ ప్లస్ 2 అనుమతులు తీసుకుని ఎక్కువ అంతస్థులు నిర్మిస్తే సహించమన్నారు.


మాట్లాడుతున్న సిద్దేశ్వర్

# ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి.. సంక్షేమం

## రాజీవ్ గాంధీ పంచాయత్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులు సిద్దేశ్వర్

వర్గల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాజీవ్‌గాంధీ పంచాయత్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులు సిద్దేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండలం నాచారం వద్ద గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం కల్పించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపు కోసం చేపట్టవలసిన చర్యలపై దిశ నిర్దేశం చేశారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో అవకాశం ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికలలో ఎక్కువ సీట్లు సాధించడానికి కృషి చేయవలసిన అవసరముందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. ఆ అప్పులకు ప్రస్తుత ప్రభుత్వం వడ్డీలు కడుతుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు అట్ల సందీప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిష్టాగౌడ్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# 541 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

జహీరాబాద్, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చిరాగ్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు వేర్వేరుగా రెండు లారీల్లో తరలుతున్న మొత్తం 541 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మాడ్గి శివారులో సరిహద్దు చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి కేఏ56-2629 నంబర్ గల లారీ రేషన్ బియ్యం లోడ్‌తో మహారాష్ట్ర వైపు వెళ్తుండగా, ఆపి తనిఖీ చేశారు. లారీలో 275 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండగా, లారీని.. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీ యజమాని భీమయ్య, డ్రైవర్ జాకీర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే, రాత్రి మరో లారీలో 266 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలుతుండగా, పట్టుకున్నారు.

# రైస్ మిల్ సీజ్

## కస్టమ్ బియ్యం తిరిగి ఇవ్వనందుకు..

రాయపోల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్‌కు ఇచ్చిన బియ్యం తిరిగి ఇవ్వని రైస్ మిల్‌పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొరడా ఝుళిపించారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డెపల్లిలోని వీరభద్ర రైస్‌మిల్‌లో సోమవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ మిల్లు యాజమాన్యం 24 వేల క్వింటాళ్ల ధాన్యం బకాయి ఉండటంతో రైస్‌మిల్‌ను సీజ్ చేశారు. రైస్ మిల్‌లో ఉన్న ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, మిల్లు యజమానిపై కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ పండరి, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సాంబశివరాలు, ఏసీఎస్‌టీఓ సాయి, రవి, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్ఐ భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# హీటర్ పెట్టి.. నిద్రపోయారు..

## మంటలంటుకుని ఇల్లు దగ్ధం.. కాలిపోయిన సామగ్రి


కాలిపోయిన ఇల్లు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేడి నీళ్ల కోసం హీటర్ పెట్టి.. వారు పడుకున్నారు. హీటర్ వేడెక్కి పక్కనే ఉన్న ఫ్రిజ్‌కు అగ్గి అంటుకుంది. ఆ నిప్పు ఇంటిని, ఇంట్లోని విలువైన వస్తువులను కాల్చేసింది. ఇంత జరుగుతున్నా.. వారు గాఢ నిద్రలో ఉండిపోయారు. మంటలు చూసి పొరుగువారు కేకలు పెట్టడంతో నిద్రలేచి బయటకు పరుగులు పెట్టారు. ఈ ఘటన మెదక్ పట్టణంలోని కుమ్మరిగడ్డలో సోమవారం జరిగింది. బాధితులు, అగ్నిమాపక అధికారుల కథనం ప్రకారం.. కుమ్మరిగడ్డకు చెందిన కుమ్మరి సంతోష్ తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సంతోష్ ల్యాబ్‌కు వెళ్లగా.. ఇంట్లో అతని భార్య మాసన, అమ్మమ్మ ఉన్నారు. స్నానం చేసేందుకు హీటర్‌తో వేడి నీటిని పెట్టి ఇద్దరు నిద్రపోయారు. హీటర్ తీయకపోవడంతో కాలిపోయి పక్కనే ఉన్న ఫ్రీజ్‌కు నిప్పు అంటుకొని మంటలు చెలగేరాయి. గమనించిన స్థానికులు గట్టిగా ఇంట్లో వారిని పిలువగా, వారు నిద్ర లేచి బయటకు వచ్చారు. వెంటనే అగ్నిమాపకకు సమాచారం అందించగా హుటాహుటిగా ఘటన స్థలానికి చేరుకొని దాదాపు నాలుగు గంటలపాటు శ్రమించి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఇంట్లో ఉన్న సర్టిఫికేట్లు, ల్యాబ్ పరికరాలు, దుస్తులు, తదితర 6 లక్షల విలువైన సామగ్రి, 15 తులాల బంగారం, రూ. 4 లక్షల నగదు, బైక్ అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.22 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు సంతోష్ బోరున విలపించాడు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రమాదం విషయం తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## న్యూస్ బాక్స్

### విద్యుత్ అంతరాయం

మెదక్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) ఈ నెల 18న చిన్న శంకరంపేట మండలంలోని ఉప్పు లింగాపూర్ 33కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా జంగరాయి తండా, చందాపూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఏ మోహన్ బాబు, ఏఈ దినాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సరఫరా ఉండదని తెలిపారు.

● శివ్వంపేట: మండల పరిధిలోని పాంబండ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా మంగళవారం పాంబండ, పోతుల బోగుడ, ఉసిరిక పల్లి, భీమ్లా తండాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇన్‌చార్జి ఏఈ సాయికుమార్ సోమవారం తెలిపారు.

### నేడు ఖేడ్‌లో వాహనాల వేలం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో సీజ్ అయిన నాలుగు బైకులను ఈ నెల 18న ఉదయం 11 గంటలకు నారాయణఖేడ్‌లోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలానికి ముందే నిర్ణీత సొమ్మును డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు. పూర్తి వివరాల కోసం 8712658915 నెంబరులో సంప్రదించాలన్నారు.

### ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

జహీరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోగల నీలం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉచితవైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి వైద్యులు మహ్మద్ నవాజ్, రాజేందర్‌బశెట్టి, ఇమ్రాన్‌మోయియోద్దీన్‌లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 20న పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో ఉచితమెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యశిబిరానికి సంబంధించి కరపత్రాన్ని వారు విడుదల చేశారు.

### మూడు నెలల్లో రోడ్డును పూర్తిచేస్తాం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా మండల ప్రజలు ఎదురు చూస్తున్న మోకీల వంద ఫీట్ల రోడ్డు కల త్వరలో పూర్తి కానుంది. మూడేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీమంత్రి కేటీఆర్ కొల్లూరు జంక్షన్ నుంచి రంగారెడి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల వరకు వంద ఫీట్ల రోడ్డు పనులకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఏడాది పాటు జోరుగా సాగిన రోడ్డు పనులు ఆ తర్వాత నత్తన నడకన కొనసాగాయి. కొత్తగా రేవంత్‌రెడ్డి సర్కారు వచ్చిన తరువాత రోడ్డు పనులు ఊపందుకున్నాయి. ఈ రోడ్డు వల్ల పటాన్‌చెరువు, రామచంద్రాపురం మండల గ్రామాల ప్రజలకు శంకర్‌పల్లి చేరేందుకు చాలమట్టుకు దూరం తగ్గుతుంది.

### ప్రణాళికతో చదవాలి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకొని చదవాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో పదో తరగతి విద్యార్థులకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేరణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలంటే భయం.. ఒత్తిడికి గురి కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. జిల్లా అధికారి శశికళ మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి మెరుగైన ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులను అందించారు. ఈ సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్‌పై జాప్యమెందుకు?

● 2016లో ప్రారంభించినా పూర్తికాని పనులు
● 2 ఫీట్ల సీసీతో డివైడర్‌తో ప్రమాదాలకు అవకాశం
● దాదాపు రెండేళ్ల తర్వాత ప్రారంభించిన 7 ఎక్స్‌టెన్షన్ సర్వహంగులతో పూర్తి



రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్‌పై 2 ఫీట్లతో సీసీ డివైడర్ వేస్తున్న యంత్రం



రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్‌పై 7 ఫీట్ల డివైడర్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)కు అనుసంధానం చేస్తూ చేపట్టిన రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్‌తో పోల్చుకుంటే రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్‌పై వివక్ష చూపుతున్నారని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జూలై 23, 2016లో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి నుంచి సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరు వరకు రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ పనులకు అప్పటి మంత్రి హరీశ్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. దశాబ్ద కాలంగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. 2018లో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం నల్లగండ్ల సర్కిల్ నుంచి సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ కొత్త మున్సిపల్ మీదుగా నేరుగా కొల్లూరు జంక్షన్ వరకు రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు అనతి కాలంలోనే అన్ని వసతులతో పూర్తయ్యింది.

**ఎలాంటి వివక్ష లేదు**

ప్రభుత్వం మాకు అందించిన నక్షాకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం. కాంట్రాక్టర్‌కు ఉన్నతాధికారులు బిల్లులు చెల్లింపులను బట్టి పనులు ముందుకు సాగుతున్నాయి. పనుల్లో ఎలాంటి వివక్ష లేదు. నక్షా ప్రకారమే పనులు చేస్తున్నాం.

-అజయ్, ఏఈ ఆర్ అండ్‌బీ

**వివక్షేనంటూ ఆరోపణలు**

వాస్తవంగా 30 ఎక్స్‌టెన్షన్ పనులను ప్రారంభించిన సుమారు రెండేళ్ల కాలం తర్వాత 7 ఎక్స్‌టెన్షన్ పనులు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ 7 ఎక్స్‌టెన్షన్ పనులే ముందుగా పూర్తయ్యాయి. రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ వెళ్లే మార్గంలో గ్రామాలు అడ్డుగా వస్తున్నాయి. పైగా ఇక్కడ చిన్న బిల్డర్ల అపార్టుమెంట్లు, డబుల్ బెడ్‌రూం లాంటివి ఉన్నాయి. ఇక్కడ 2 ఫీట్ల డివైడర్ ఏర్పాటు చేస్తున్నారు. 2ఫీట్ల డివైడర్ ఏర్పాటు వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్‌లో 7 ఫీట్ల ఎత్తుతో డివైడర్ పూర్తి చేయడం, బటర్ పై లైట్ల ఏర్పాటు, మధ్యలో పచ్చటి, అందమైన మొక్కలను నాటారు. ఈ రోడ్డులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలు పరుగులు పెడుతున్నాయి. కాని రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్‌లో రోడ్డు పూర్తి కాక, వసతులు కల్పించకపోవడంతో ఇక్కడ రాత్రుళ్లు ప్రయాణాలు సాగించేందుకు ప్రజలు జంకుతున్నారు. రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్‌లో ఎక్కువ శాతం ధనికులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నివాసాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రభుత్వం 7 ఎక్స్‌టెన్షన్‌కు ప్రాధాన్యతనిచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 30 ఎక్స్‌టెన్షన్ రోడ్డు పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● సంగారెడ్డి ప్రజావాణిలో బాధితుల అర్జీలు



సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీపీవో సాయిబాబాకు దరఖాస్తును అందజేస్తున్న బాధితులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలపై డీపీవో సాయిబాబాకు అర్జీలు అందజేశారు. జాప్యం చేయకుండా బాధితుల సమస్యలను పరిష్కరించాలని డీపీవో సంబంధిత అధికారులకు సూచించారు. వచ్చిన అర్జీల్లో కొన్ని ఇలా.. జహీరాబాద్ మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు ట్రెజరీ ద్వారా కాకుండా మున్సిపాలిటీ ద్వారా చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, యూనియన్ అధ్యక్షుడు మహిపాల్ అర్జీలో కోరారు. చౌటకూర్ మండలం పోసానిపల్లి గ్రామానికి చెందిన తోట సువర్ణ తమకు సంబంధించిన భూమి వివరాలు పాత పాస్‌బుక్కులో ఉన్నాయని, కొత్త పాస్ బుక్కు వచ్చాక అందులో నమోదు చేయలేదన్నారు. తమ భూమిని కబ్జాకు ప్రయత్నిస్తూ అందులోకి వెళ్లకుండా బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అందోల్ మండలం కొడెకల్ గ్రామానికి చెందిన చంద్రకళ ఫిర్యాదు చేశారు. వీటితో పాటు పింఛన్లు, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర సమస్యలకు సంబంధించి మొత్తం 43 అర్జీలు అందాయి. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మెదక్‌లో పోలీసు ప్రజావాణి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

## గ్రామాల్లో వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు



బి కొండాపూర్‌లో లక్ష్మీనృసింహస్వామి వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్థులు

మెదక్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆలయాల వద్ద వార్షికోత్సవ జాతరలు జరుపుకోవడం ఇక్కడి సంప్రదాయమని, తెలంగాణ అంటేనే జాతర్లకు ప్రతీక అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండల పరిధిలోని బి కొండాపూర్ సింగరాయగుట్ట లక్ష్మీనృసింహస్వామి వార్షికోత్సవం, కసాన్పల్లిలో మల్లికార్జున స్వామి వార్షికోత్సవ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బి కొండాపూర్‌లో బండ్ల ఊరేగింపును ఎమ్మెల్యే ఎస్సీ ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### వెంకటాపూర్‌లో ఎడ్లబండ్లతో ఊరేగింపు

మెదక్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ శివారులోని బోనాల కొండాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతరను ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.



సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చింతా, బీఆర్ఎస్ శ్రేణులు



జహీరాబాద్‌క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు



జిన్నారం: కేసీఆర్ జన్మదిన సందర్భంగా మాదారంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శివస్వాములు

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

న్యూస్‌నెట్‌వర్క్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 71వ జన్మదినం సందర్భంగా సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్లు, పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి, బాణసంచా పేలుస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఆసుపత్రులు, అనాథ పిల్లలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వృక్షార్చన కార్యక్రమం చేపట్టి పలుచోట్ల పెద్దఎత్తున మొక్కలు నాటారు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలంటూ ఆలయాల్లో పార్టీ కార్యకర్తలు పూజలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు మాట్లాడుతూ.. పలు అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలతో తెలంగాణ రూపురేఖలు మార్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



శివ్వంపేటలోని గ్రంథాలయం వద్ద వేడుకల్లో ఎమ్మెల్యే సునీత రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి



పాపన్నపేట: ఏడుపాయల క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ మాజీ చైర్మన్ బాలాజీగౌడ్ తదితరులు

## అంతా నా ఇష్టం..

(5వ పేజీ తరువాయి)

అందడంతో కంటితుడుపు చర్యలు చేపట్టారు. కబ్జాలను తొలగించకుండానే అరకొరగా ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్మించడంపైనా విమర్శలు వచ్చాయి.

### శెట్టికుంట బఫర్ జోన్‌లో నాలా కన్వర్షన్?

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 946లో శెట్టికుంట చెరువు కట్ట బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే నిషేధిత భూమికి దొడ్డిదారిలో రిజిస్ట్రేషన్లు చేయడంతో పాటు ఏకంగా వ్యవసాయేతర భూమిగా మార్పిడి చేస్తూ తహసీల్దార్ రాధ అనుమతులు జారీ చేశారు. 26 గుంటల వ్యవసాయ భూమి శెట్టికుంట చెరువు కట్ట బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుండగా ఇందులో 6 గుంటల భూమిని వ్యవసాయేతర భూమిగా మారుస్తూ నాలా కన్వర్షన్ చేయడం విమర్శలకు దారితీసింది.

### బదిలీ ఉత్తర్వుల నిలుపుదలకు ప్రయత్నం

తహీల్దార్ రాధ బదిలీకి ఈ నెల 8న ఉత్తర్వులు వెలువడినా 16 వరకు బహిర్గతం కాకుండా తొక్కిపెట్టారు. ఉత్తర్వుల నిలుపుదలకు ఆమె శతవిధాలుగా ప్రయత్నాలు చేశారని ప్రచారం జరుగుతున్నది. కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చేందుకు విశ్వప్రయత్నం చేశారు. రాష్ట్రస్థాయిలో పేరున్న ఓ రెవెన్యూ నాయకుడు ఆమె తరఫున పెద్దఎత్తున లాబీయింగ్ చేసినట్లు తెలుస్తున్నది. అయినా అవినీతి, క్రమశిక్షణా రాహిత్యం, ఉన్నతాధికారులను తప్పుదారి పట్టించడం తదితర ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆమె బదిలీ తప్పలేదు. కాగా, ఉత్తర్వులు వెలువడిన వారం రోజులుగా అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన లావాదేవీలపై దర్యాప్తు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆలయాల అభివృద్ధికి సహకారం



నూతన ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మల్లన్న స్వామి ఆలయం, శివాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి, మల్లన్నస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల ఏర్పాటుకు తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మల్లెపల్లి సోమిరెడ్డి, ఉమేశ్వర్, డోకూరి రవీందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, మల్లారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు సమాజంలో సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా సమాజంలో నెలకొన్న సమస్యలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక సాహితీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ పేర్కొన్నారు. సోమవారం ఖేడ్‌లోని వారాహిహాల్‌లో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి కూడా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అనిల్‌కుకుమార్, నరేష్‌కుమార్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## చేగుంట పీహెచ్‌సీలో టీబీ నిర్ధారణ పరీక్షలు



చేగుంట పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో శ్రీరామ్

మెదక్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వంద రోజుల టీబీ ప్రోగ్రాంలో భాగంగా చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నార్సింగి చేగుంట, మండలాలకు చెందిన ప్రజలకు టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొబైల్ ఎక్స్‌రే వ్యాన్ ద్వారా సుమారు 170 మందికి ఎక్స్‌రే తీసినట్లు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి పూర్తి ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వందరోజుల టీబీ ప్రోగ్రాంను జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి నవీన్ సందర్శించి రోగుల వివరాలను తెలుసుకున్నారు.

## భూమిని తప్పుగా చూపించి రిజిస్ట్రేషన్

● నిందితులపై కేసు నమోదు చేసిన సిర్గాపూర్ పోలీసులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తక్కువ రేటుకు భూమి లభిస్తుందని, ఒక భూమికి బదులుగా మరొకరి భూమిని చూపించి రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూమి పట్టేదారు బానోత్ లక్ష్మణ్, బ్రోకర్ ప్రేమ్‌సింగ్ ఇలియాస్ ప్రేమ్‌సాగర్, నాగ్‌ధర్ తండాకు చెందినవారు సిర్గాపూర్ మండలం వంగ్దాల్ శివారులోని సర్వే నెంబరు 41/ఏ లో మూడున్నర ఎకరాల భూమి తక్కువ రేటుకు లభిస్తుందని, హైదరాబాద్‌కు చెందిన రాధాక్రిష్ణకు నమ్మబలికి రూ.51 లక్షలకు విక్రయించారు. భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం రాధాక్రిష్ణ తాను కొన్న భూమిని పరిశీలించేందుకు వెళ్లగా ఆ భూమికి చెందిన అసలు యజమాని ఇది తన భూమి అని చెప్పారు. లక్ష్మణ్, ప్రేమ్‌సింగ్‌లు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చిన భూమి అసలు రోడ్డు లేకుండా పనికి రానిదిగా ఉందని చెప్పడంతో రాధాక్రిష్ణ కంగు తిన్నాడు. బాధితుడు రాధాక్రిష్ణ ఫిర్యాదు మేరకు లక్ష్మణ్, ప్రేమ్‌సింగ్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

## విఠల్‌నాయక్ తండాలో వ్యక్తి అదృశ్యం



కిషన్ జాదవ్

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విఠల్‌నాయక్ తండాలో వ్యక్తి అదృశ్యం కేసు నమోదైంది. ఏఎస్ఐ రవీందర్, తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కిషన్ జాదవ్(42)చెరకు నరకడానికి జహీరాబాద్ సమీపంలో హోతి.బి గ్రామానికి గత నవంబరులో కుటుంబంతో సహా వలస వెళ్లాడు. ఈ నెల 15న సొంతపని మీద తండాకు వచ్చి తన సోదరుడి కుమారుడైన రాజుతో మాట్లాడి అదే రోజు కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. కానీ అక్కడికి చేరుకోలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఇప్పటి వరకు ఆచూకీ లభ్యం కాలేదన్నారు. సోమవారం సోదరుడి కుమారుడైన రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఏఎస్ఐ తెలిపారు.

## 'తెల్లాపూర్' పరిధిలో 11కేవీ విద్యుత్ తీగల ఆధునికీకరణ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ తీగలను ఆధునీకరించడానికి నూతన కేబుల్ విధానాన్ని మున్సిపల్ వ్యాప్తంగా ఏర్పాటు చేయడానికి విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు అన్ని ప్రాంతాల్లో 11కేవీ విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేబుళ్లలో కనెక్షన్ ఇచ్చే ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తామని ఏఈ శివ శంకర్ తెలిపారు. ఇందుకు 8 లైన్ క్లియర్(ఎల్‌సీ) అవసరమౌతుందని చెప్పారు. రోజుకు 3ఎల్‌సీ అవసరముంటుందన్నారు. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.నూతన కేబుల్‌తో ఎక్కువ లోడ్‌తో విద్యుత్ సరఫరా చేయవచ్చని ఏఈ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓల్డ్ ఎంఐజీలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్‌సరఫరా ఉండదని చెప్పారు.

## జీవితాన్ని మలుపు తిప్పేది పదో తరగతి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు

రామచంద్రాపురం టౌన్ ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు జీవితాన్ని మలుపు తిప్పే పరీక్షలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. సోమవారం రామచంద్రాపురం భెల్ జడ్పీపాఠశాల, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. 5 నుంచి 8వ తరగతి 70 మంది విద్యార్థులు ఉన్నందున పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎంఈవో పీపీరాథోడ్‌ను ఆదేశించారు. అనంతరం జడ్పీ పాఠశాలలో పదవతరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఇష్టంతో చదివితే పది జీపీఏ సాధించడం సులభమేనన్నారు. అనంతరం కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి: మెదక్ ఎస్పీ



ఉదయ్‌కుమార్‌రెడ్డి, మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నూతనంగా నియామకమైన పోలీసు సిబ్బందికి రెండో బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. గత 30 ఏళ్లలో పోలీసుశాఖలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. అందుకనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిచుకోవాలన్నారు. నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

## రోడ్లపై వ్యర్థాలను పారబోస్తే కఠినచర్యలు

జహీరాబాద్, ఫిబ్రవరి 17ః పట్టణంలోని ప్రధాన, అంతర్గత రోడ్లపై చెత్తను, వ్యర్థాలను పారబోస్తే కఠినచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యాపారసముదాయాల్లోనివారు చెత్తసేకరణకోసం వచ్చే వాహనాల్లోనే చెత్త వేయాలన్నారు. వ్యాపార సముదాయాల్లో ప్లాస్టిక్‌వాడకాన్ని పూర్తిగ నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే రూ.10వేలు జరిమానా వేస్తామని హెచ్చరించారు. ఆయా వ్యాపారాలను చేపట్టేవారు విధిగ లైసెన్సులు తీసుకోవాలని, మరికొందరు లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

## డంపుయార్డుకు వ్యతిరేకంగా అఖిలపక్షం దీక్ష

నర్సాపూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి సమీపంలోని ప్యారానగర్ వద్ద జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయనున్న డంపుయార్డు వల్ల అధికంగా నష్టపోయేది నర్సాపూర్ ప్రాంతమే అని అఖిలపక్షం నాయకులు పేర్కొన్నారు. అందువల్ల ఎట్టిపరిస్థితిలో దానిని ఏర్పాటు చేయవద్దంటుస్థానిక అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రిలే దీక్షలు ప్రారంభించారు. డంపుయార్డుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ అఖిలపక్షం ఆధ్వర్యంలో జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యమించాలని నిర్ణయించారు. అందులో భాగంగా నర్సాపూర్‌లోని బస్టాండు సమీపంలో జాతీయరహదారి పక్కన దీక్ష చేశారు. ఈ దీక్షకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి కూడా హాజరై సంఘీభావం తెలిపారు. మొదటిరోజు దీక్షలో అఖిలపక్షానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, గోడరాజేందర్, రమణరావు, జ్ఞానేశ్వర్, నగేష్, సుదీర్‌గౌడ్, దావుద్, కొత్తశ్రీనివాస్‌గుప్తా, గుండం శంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. దీక్షలో స్థానిక విద్యార్థులు కూడా పాల్గొని తమ మద్దతు పలికారు.

## బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం: కాంగ్రెస్

నర్సాపూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగు ఓడిపోతామన్న భయంతో బీజేపీతో లోపాయికారి ఒప్పందం పెట్టుకుని అభ్యర్థినే బరిలో దించకుండా ఆ పార్టీ అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు తెలుపుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. సోమవారం నర్సాపూర్‌లో ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డితో కలిసి రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్ విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు ప్రజలను మభ్యపెట్టే గొప్పలు చెప్పుకుంటూ రాజకీయ ప్రయోజనాలు పొందాలను చూస్తున్నారని ఆ పార్టీకి అంత ప్రజలలో మద్దతు ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని బరిలో ఎందుకు దించలేదని ప్రశ్నించారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని, ఇప్పుడు వారే రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌గుప్తా, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్ గౌడ్, విశ్వాంబరం. నారాయణరెడ్డి, హకీం, మహేశ్వర్‌రెడ్డి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.